సాక్షి
నిర్మల్
శనివారం ; 8 ; జూన్ ; 2024



జూన్.. బతుకు భారమే..

జూన్ నెల అంటేనే సామాన్యులు భయపడే పరిస్థితి తలెత్తుతోంది. జూన్ వ్యవసాయానికి పెట్టుబడి కాలం. పిల్లల చదువుల ఖర్చులు కలిపి తడిసి మోపెడవుతున్నాయి. 8లో▸



ఆంధ్రాకు అడవి పందులు!

వేసవికాలం లో అడవిలో వన్యప్రాణికి రక్షణ కరువవుతోంది. తాజాగా ఆంధ్రా వేటగాళ్లు కూడా జిల్లాకు వచ్చి ఇక్కడి అడవి పందులను తరలించుకుపోతున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
37.7 /26.6

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాలు, తుపాను ప్రభావంతో చాలాచోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దివ్యాంగులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



నిరసన దీక్ష చేపట్టిన దివ్యాంగులు

నిర్మల్‌చైన్‌గేట్: నిరుపేదలు దివ్యాంగులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని స్నేహ వికలాంగుల సంక్షేమ వెల్ఫేర్ సొసైటీ నాయకుడు ప్రవీణ్‌కుమార్ కోరారు. వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్నేహ వికలాంగుల సంక్షేమ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా చాలా నష్టపోయారన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముత్యం, ఈశ్వరి, గంగమణి, అరుణ్‌కుమార్, పోశెట్టి పాల్గొన్నారు.

10 నుంచి ప్రజావాణి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 10వ తేదీ నుంచి తిరిగి నిర్వహిస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని పేర్కొన్నారు. కోడ్ ముగియడంతో ఈనెల 10 నుంచి సోమవారం కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తామని తెలిపారు.

ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ కోరారు. జిల్లాలోని పలు విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పుస్తకాలు, యూనిఫాంలు అమ్ముతున్నాయని, అక్రమంగా అడ్మిషన్లు చేసుకుంటున్నాయని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా డీఈవో చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రతీ సంవత్సరం విచ్చలవిడిగా ఫీజులు పెంచుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోపిడీ చేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు ప్రచార క్యాంపెయిన్ చేస్తూ ముందస్తు అడ్మిషన్లు చేసుకున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో వారం రోజులు ఆలస్యంగా క్యాంపెయిన్ (బడిబాట) ప్రారంభించారని పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు మరమ్మతులు చేయించి కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

మానవహక్కులను పరిరక్షించాలి



జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్‌కు ఐడీని అందజేస్తున్న జాతీయ అధ్యక్షుడు

ఖానాపూర్: మానవహక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత అని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు పాండురంగ నర్వడే అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సంఘం సభ్యులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మానవహక్కుల కమిషన్ రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా ప్రజలకు కల్పించిన హక్కుల రక్షణ బాధ్యతలు చేపడుతుందన్నారు. దేశంలో ఏ వ్యక్తి అయినా స్వేచ్ఛగా బతికే హక్కు ఉందని పేర్కొన్నారు. తప్పు చేసిన ఏ వ్యక్తిని అయినా చట్టపరంగా శిక్షించాలని తెలిపారు. వ్యక్తి హక్కులకు భంగం కలిగించినా, అన్యాయం చేసినా ప్రశ్నించేందుకు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఉంటుందన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా ఆకుల వెంకటేశ్..

మండలంలోని తర్లపాడ్ గ్రామానికి చెందిన ఆకుల వెంకటేశ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. నూతనంగా నియామకమైన వెంకటేశ్‌కు జాతీయ అధ్యక్షుడు గుర్తింపు కార్డును అందజేశారు. అనంతరం సభ్యులు ఇరువురిని సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కోట్నాక బుద్దారావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నైతం శ్రీనివాస్, మండలాధ్యక్షుడు ములంకల మురళి, మండల సహాయ కార్యదర్శి షేర్ భూమేశ్, మండల ఉపాధ్యక్షుడు కల్లెం రమేశ్, అడ్వాయిజర్ నరేశ్‌కుమార్, కడెం మండల అధ్యక్షుడు సోగుల శేఖర్, పెంబి మండల అధ్యక్షుడు సీడాం చిన్ను, సభ్యులు నాగోరావు, ప్రభాకర్, కిషన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కారు పంచర్!



ఆదిలాబాద్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (ఫైల్)

- డిపాజిట్ కోల్పోయి కదలలేని స్థితికి..
- అన్ని నియోజకవర్గాల్లో మూడోస్థానం
- ఎమ్మెల్యేలున్న చోటా.. ఇదే పరిస్థితి
- 'అసెంబ్లీ' ఫలితాల తర్వాతే కష్టాలు
- ఓటమితో బీఆర్‌ఎస్‌ను వీడిన నేతలు
- జీర్ణించుకోలేకపోతున్న కార్యకర్తలు

సాక్షి, ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్‌ఎస్ పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గులాబీ పార్టీ ఆరుసార్లు పోటీ చేయగా, 2004లో మధుసూదన్‌రెడ్డి, 2014లో గోడం నగేశ్ గెలుపొందారు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో మధుసూదన్‌రెడ్డి ఓటమి చెందారు. అప్పుడు 18.86 శాతం ఓట్లు మాత్రమే సాధించారు. అయితే తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అంతకంటే తక్కువ ఓట్లతో సరిపెట్టుకుంది. పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కుకు 11.11 శాతం ఓట్లు మాత్రమే రాగా డిపాజిట్ కోల్పోయారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈ పార్టీలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పుడున్న పరిస్థితిలో పార్టీ కోలుకోవడం కష్టమేనన్న అభిప్రాయం కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. కారు పంచర్ అయిందని ప్రత్యర్థులు ఎద్దేవా చేసే పరిస్థితికి వచ్చింది.

మూడో స్థానానికి పరిమితం

కారు పార్టీ ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడో స్థానానికి పడిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్, బోథ్‌లో ఆ పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. సిర్పూర్, ఖానాపూర్, ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఓడిపోయినా ద్వితీయ స్థానంలో నిలిచారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయా నియోజకవర్గాల్లో ఓడిపోయిన పలువురు ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో పార్టీకి నిర్మల్, ముథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో కోలుకోలేని దెబ్బతగలగా, మిగతా నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. కాగా, ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న బోథ్, ఆసిఫాబాద్‌లోనూ గులాబీ పార్టీ మూడో స్థానానికి పడిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఆరు నెలల్లోనే ఇంత తేడానా.. అనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది.

పూర్వవైభవం సాధ్యమేనా?

బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం సాధించడం కష్టమేనన్న అభిప్రాయం పార్టీ కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి ఏకంగా డిపాజిట్ కోల్పోవడంతో ప్రస్తుతం ఈ విషయంపై చర్చసాగుతోంది. పార్టీ నుంచి ముఖ్యనేతలు జారుకున్నప్పటికీ కార్యకర్తలు అండగా ఉన్నారని, ఆ బలంతోనే తిరిగి పూర్వవైభవం సాధిస్తామని పార్టీ అగ్రనేతలు పేర్కొంటున్నారు. కానీ.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ప్రస్తుతం బోథ్ ఎమ్మెల్యేగా అనిల్‌జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా కోవ లక్ష్మితోపాటు సిర్పూర్‌లో ఎమ్మెల్సీ దండే విఠల్, ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి జోగు రామన్న, ఖానాపూర్‌లో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్, నిర్మల్‌లో సీనియర్ నేత రాంకిషన్‌రెడ్డి, ముథోల్‌లో పడకంటి రమాదేవి, డాక్టర్ కిరణ్‌కుమార్, జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ లాంటి ముఖ్యనేతలు మాత్రమే మిగిలారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ పార్టీ ఏ మేర ప్రభావం చూపుతుందనేది చూడాల్సిందే.

2023 అసెంబ్లీ, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు వచ్చిన ఓట్లు

నియోజకవర్గం	అసెంబ్లీ	పార్లమెంట్
సిర్పూర్	60,614	19,840
ఆసిఫాబాద్	83,036	38,597
ఖానాపూర్	54,168	18,520
ఆదిలాబాద్	60,916	16,265
బోథ్	76,792	22,472
నిర్మల్	55,697	8,181
ముథోల్	74,523	12,505

పార్లమెంట్ సెగ్మెంట్‌లో ఓట్ల శాతం

అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఓట్లు :
4,65,476 (35.59 శాతం)

పార్లమెంట్ ఎన్నికల్లో సాధించిన ఓట్లు :
1,37,300 (11.11 శాతం)

విత్తనం ఎంపికలో జాగ్రత్త

- ధ్రువీకరించినవే కొనుగోలు చేయాలి..
- అదునులో విత్తుకుంటే మేలు
- వరిలో స్వల్పకాలిక, మధ్య కాలిక రకాలు సాగు చేయాలి
- జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో రైతుల సందేహాలకు సమాధానాలు



సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అంజిప్రసాద్

నిర్మల్‌చైన్‌గేట్: పంటల సాగులో కీలకమైన విత్తనాల ఎంపికలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) అంజి ప్రసాద్ సూచించారు. వానాకాలం సీజన్ మొదలైన నేపథ్యంలో రైతుల సందేహాలు నివృత్తి చేసేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఫోన్‌ఇన్‌లో పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు ఫోన్ చేశారు. నిర్ణీత వ్యవధిలో రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. సందేహాలు నివృత్తి చేశారు. విత్తన రకాలు, కాలపరిమితి, అందుబాటులోఉన్న విత్తనాల గురించి తెలియజేశారు. ప్రభుత్వ ధ్రువీకరణ పొందిన కంపెనీలు, ఏజెన్సీలు, సంస్థల విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. పంట కాలం పూర్తయ్యే వరకు బిల్లులు భద్రపర్చుకోవాలని చెప్పారు. అంతేకాకుండా వరి, పత్తిలో కొత్త వంగడాల వివరాలు వెల్లడించారు.

ప్రశ్న: నకిలీ విత్తనాల గుర్తింపు, కొనుగోళ్లలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– పుప్పాల రవి, పెంబి మండలం

జవాబు: ప్రభుత్వ లైసెన్సు లేని దుకాణాలు, వ్యక్తులు విక్రయించే విత్తనాలు నకిలీవిగానే భావించాలి. అలాగే, ప్యాకెట్లలో కాకుండా లూజ్‌గా విక్రయించినా తీసుకోవద్దు. లైసెన్స్ కలిగిన షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేసి బిల్లులు భద్రపర్చుకోవాలి. విత్తనాల విషయంలో అనుమానం వస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలి.

ప్రశ్న: నల్ల రేగడి నేలల్లో ఏ వరి రకాలు వేయాలి?

–కె.వెంకటేశ్వర్లు,

జవాబు : నల్లరేగడి నేలల్లో ప్రస్తుతం స్వల్పకాలిక, మధ్య కాలిక రకాలు సాగు వేసుకోవచ్చు. ఈ నేల దమ్ములో వరిని వెదజల్లే పద్ధతుల్లో లేదా డ్రమ్ సీడర్ పద్ధతిలో కూడా సాగు చేసుకోవచ్చు.

ప్రశ్న: సొసైటీలలో యూరియా ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది?

– నర్సింగ్, ఉమ్రి, తానూరు మండలం

జవాబు: సొసైటీలలో మరో రెండు రోజుల్లో యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పంట చేలలో తుక్కు పోవాలంటే సూపర్ చల్లాలి.

ప్రశ్న: సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

– వెంకటేశ్, మద్దిపడగ, కడెం మండలం

ఏవో, ఏఈవోలు వారివారి క్లస్టర్ల పరిధిలో సేంద్రియ ఎరువుల వాడకం గురించి అవగాహన కల్పిస్తున్నారు. నాసిరకం విత్తనాల జోలికి వెళ్లొద్దు. డీలర్ల వద్దనేకొనుగోలు చేయాలి.

ప్రశ్న: వరి కొయ్యకాలుకు నిప్పు పెట్టవచ్చా?

–జాదవ్, ఖానాపూర్

జవాబు: వరి కొయ్యకాలుకు నిప్పు పెట్టడం వలన నేలలో ఉన్న సూక్ష్మజీవులు చనిపోతాయి. కలియ దున్నేటప్పుడు వేస్ట్ డీకంపోజర్ స్ప్రే చేయడం వల్ల భూమిలో ఉన్న కొయ్యలు మురిగిపోతాయి. తర్వాత సూపర్ వాడితే సరిపోతుంది.

ప్రశ్న: వరిలో దోమపోటు రాకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలి?

– వెంకటేశ్, ఖానాపూర్

జవాబు: వరిలో దోమపోటు నివారించేందుకు అధికారుల సూచనల మేరకు నత్రజని వాడకాన్ని తక్కువ మోతాదులో ఎక్కువసార్లు పిచికారీ చేయాలి.

ప్రశ్న: నాకు ఏడు ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం ఏ పంటలు వేస్తే బాగుంటుంది?

–రవి, నర్సాపూర్

జవాబు: నీరు పుష్కలంగా ఉన్న నల్ల రేగడి నేలలో ప్రస్తుతం సోయా వేసుకోవాలి. తర్వాత పంట మక్క వేసుకుంటే దిగుబడి బాగా వస్తుంది.

ప్రశ్న: జీలుగ విత్తనాల కొరత ఉంది.. ఎప్పుడు వస్తాయి?

– శ్రీనివాస్, పెంచికల్‌పాడ్, కుంటాల మండలం

జవాబు: కుంటాల మండలానికి గతేడాది 72 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు కేటాయించాం. ఈ సంవత్సరం కూడా 72 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు పంపిణీ పూర్తి చేశాం. అదనంగా మరో 40 క్వింటాళ్లు మండలానికి కేటాయించేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: కుంటాల మండల కేంద్రంలో పత్తి విత్తన బ్యాగు రూ.864 ఉంటే రూ.1,200 నుంచి రూ.1,400లకు అమ్ముతున్నారు. చర్యలు తీసుకోండి.

–రఘు,కుంటాల

జవాబు: అధిక ధరలకు విత్తనాలు అమ్మడం చట్టరీత్యా నేరం. సంబంధిత ఏవోకు సమాచారం అందించి ఎంక్వైరీ చేయమని చెప్తాను.

ప్రశ్న: మాది ఎర్రచెలక భూమి. నీళ్లు లేవు ఏ రకం పంటలు వేయాలి?

జవాబు: పత్తిలో అధిక సాంద్రత గల రాశి, నూజివీడు, క్రిస్టల్ వంటి విత్తనాలు తీసుకోవాలి. ఎకరానికి నాలుగు ప్యాకెట్ల పత్తి విత్తనాలు వాడాలి.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- పట్టణంలో పలు విత్తన దుకాణాల తనిఖీ


నిర్మల్‌చైన్‌గేట్: రైతులకు నకిలీ, నాసిరకం విత్తనాలు అమ్మితే సంబంధిత షాపులపై కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. పట్టణంలోని అరుణ్ ఆగ్రో ఏజెన్సీస్ విత్తనాలు, పెస్టిసైడ్స్ షాప్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని, ప్రతీ రైతుకు విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, షాపుల యజమానులు నిబంధనలు పాటించాలన్నారు. విత్తన నిల్వలు, ధరలు ప్రతీ షాపులో ప్రదర్శించాలని సూచించారు. వానాకాలానికి అవసరమైన వివిధ రకాల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని తెలిపారు. నకిలీ విత్తనాల అక్రమ రవాణాను నియంత్రించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో తనిఖీ బృందాలను జిల్లా, మండల స్థాయిల్లో ఏర్పాటు చేశామని వివరించారు. విత్తన, ఎరువుల దుకాణాలను, గోదాములను తనిఖీ చేస్తామన్నారు. వానాకాలం పంటల ప్రణాళికకు అనుగుణంగా ప్రత్తి, మొక్క జొన్న, సాయా, కంది, ఇతర పప్పు దినుసుల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లాలో విత్తనాలు, ఎరువుల కొరత లేదని, అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి రసీదు తీసుకోవాలని సూచించారు. రోజువారీ రిపోర్టులను అందజేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. తనిఖీలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

బదిలీలకు వేళాయె..

- ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్ విడుదల
- నేటి నుంచే ప్రక్రియ మొదలు..
- టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు
- జిల్లాలో సుమారు 500 మందికి లబ్ధి



నిర్మల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు తీపి కబురు అందించింది. ప్రమోషన్లు, బదిలీలకు పచ్చ జెండా ఊపింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం షెడ్యూల్ విడుదల చేసింది. శనివారం నుంచి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొదలవుతుంది. దీంతో ఎన్నో ఏళ్లుగా ప్రమోషన్లు, బదిలీలకు ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల కల నెరవేరనుంది. గతేడాది ఆగిపోయిన ప్రమోషన్లు బదిలీలను చేపట్టాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉన్నతాధికారులకు ఎన్నోసార్లు విన్నవించారు. ఎలక్షన్ కోడ్ కారణంగా సాధ్యం కాలేదు. గురువారం కోడ్ ముగియడంతో శుక్రవారం సాయంత్రం బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేసింది. మూడేళ్లలో రిటైర్ అయ్యే వారికి బదిలీ నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పదోన్నతులు ఇలా...

ఉపాధ్యాయులకు ప్రమోషన్లతో జిల్లాలో సుమారు 500 మంది లబ్ధి పొందనున్నారు. దీనికోసం జిల్లా అధికారులు క్యాడర్ స్ట్రెంత్ వివరాలు సిద్ధం చేశారు. సంఘ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం 29 మంది పీఈటీలు, 98 మంది తెలుగు పండితులకు, 92 మంది హిందీ పండితులకు లబ్ధి చేకూరనుంది. వీరితోపాటు ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌గా, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్లుగా ప్రమోషన్ లభిస్తుంది. భాషా పండితుల పోస్టుల అప్‌గ్రేడేషన్‌పై హైకోర్టు డివిజన్ బెంచ్ గత మార్చిలో తీర్పు ఇచ్చింది. స్కూల్ అసిస్టెంట్, భాషా పండితుల పోస్టులకు కేవలం భాషా పండితులు మాత్రమే అర్హులని.. ఎస్జీటీలు అర్హులు కారని పేర్కొంది. దీంతో జిల్లాలో సుమారు 190 మంది భాషా పండితులకు, మరో 29 మంది పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు దక్కనున్నాయి.

ఇప్పటివరకు జరిగింది ఇదీ..

గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో పదోన్నతులు బదిలీల ప్రక్రియ చేపట్టారు. పదోన్నతులకు టెట్ తప్పనిసరి అని హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో బదిలీల ప్రక్రియ మొత్తం ఆగిపోయింది. దానికి తోడు జీవో 317 వల్ల తాము నష్టపోతున్నామంటూ కొందరు ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించారు. సెప్టెంబర్ లో జిల్లాలో 65 మంది స్కూల్ అసిస్టెంట్లకు పీజీహెచ్‌ఎంలుగా ప్రమోషన్లు లభించాయి. తాజాగా టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు ఇవ్వనున్నారు.

ప్రమోషన్ పోస్టుల వివరాలు...

జిల్లాలో ప్రమోషన్ ద్వారా భర్తీ చేసే పోస్టుల వివరాలు ఇలా ఉన్నాయి. హెచ్‌ఎం గ్రేడ్-2(06) పోస్టులు, పీఎస్ హెచ్‌ఎం(ప్రభుత్వ)- 4, లోకల్ బాడీ- 50, గణితం(తెలుగు మీడియం , ప్రభుత్వ)-2, లోకల్ బాడీ- 20, ఉర్దూ మీడియం గౌట్- 2, లోకల్ బాడీ-03, మరాఠీ మీడియం- 2, ఫిజికల్ సైన్స్(తెలుగు మీడియం ప్రభుత్వ)-3, లోకల్ బాడీ-06, ఉర్దూ మీడియం- 1, బయో సైన్స్ (తెలుగు మీడియం, ప్రభుత్వ)-02, తెలుగు మీడియం - 39, ఉర్దూ మీడియం, ప్రభుత్వ- 1, లోకల్ బాడీ-01, మరాఠీ మీడియం, ప్రభుత్వ-01 . లోకల్ బాడీ-01, సోషల్ స్టడీస్(తెలుగు మీడియం, ప్రభుత్వ)-02, లోకల్ బాడీ- 53, ఉర్దూ మీడియం- 3, లోకల్ బాడీ-04, మరాఠీ మీడియం ప్రభుత్వం-01, లోకల్ బాడీ-3 పోస్టులు ఉన్నాయి. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

గ్రూప్–1 పరీక్ష ప్రశాంతంగా నిర్వహించాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 9న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేలా పనిచేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్ 1 పరీక్ష, నిబంధనలపై విధుల్లో పాల్గొనే సిబ్బందికి శుక్రవారం నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా పరీక్ష నిర్వహించాలన్నారు. విధులు నిర్వహించే అధికారులు సమన్వయతో పని చేయాలన్నారు. రూట్ అధికారులు తమ లోకేషన్లను ముందస్తుగానే చూసుకోవాలని, శాఖ అధికారులు పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో వెళ్లి పర్యవేక్షించాలని సూచించారు. ఉదయం 7 గంటలకు అధికారులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు అభ్యర్థులను పరీక్ష కేంద్రల్లోకి అనుమతించాలని తెలిపారు. ప్రతీ అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని, పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులతోసహా, సిబ్బంది కూడా మొబైల్ ఫోన్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రాల్లోకి తీసుకురావొద్దని సూచించారు. అభ్యర్థులు తెచ్చుకునే హాల్ టికెట్, ఫొటో, ఇతర గుర్తింపు కార్డులతో సరిపోల్చుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలు సీసీ కెమెరాల నిఘలో ఉంటాయని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని ఆదేశించారు. తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని సూచించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా గ్రూప్-1 పరీక్ష నోడల్ అధికారి ఫైజాన్ అహ్మద్ పరీక్ష నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు, ఏర్పాట్లు, అధికారుల విధులు, తదితర అంశాలపై వివరించారు. సమావేశంలో గ్రూప్-1 పరీక్ష ప్రాంతీయ సమన్వయకర్త గంగారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

నిర్మల్ టౌన్: గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్షకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. జిల్లాలో 13 కేంద్రాలు ఉన్నాయని, వీటిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

పాఠశాలల ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనులు పాఠశాలల ప్రారంభానికి ముందే పూర్తిచేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతి, విద్యార్థులకు యూనిఫాం పంపిణీ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు పూర్తయిన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, స్లాప్ వంటి పనులు, చేస్తున్న పనులకు సంబంధించిన వివరాలను పాఠశాలల వారీగా అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తయిన తర్వాత భవనాలకు పెయింటింగ్ వేయాలన్నారు. విద్యార్థులకు పంపిణీ చేసే యూనిఫాంల స్టిచ్చింగ్ వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో గోవింద్, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

నిర్మల్‌టౌన్: పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోపు జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పిల్లలను తరలించే బస్సులకు ఫిట్‌నెస్ పరీక్ష చేయించాలని ఎంవీఐ మహేందర్ సూచించారు. జిల్లాలో మొత్తం 317 ప్రైవేట్ పాఠశాలల బస్సులు ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు కేవలం 73 వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేశామని పేర్కొన్నారు. మిగిలిన బస్సులకు పాఠశాలల ప్రారంభం నాటికి ఫిట్‌నెస్ టెస్టు చేయించాలని చేయించాలని సూచించారు. ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపై వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. వర్షాల వలన ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. రైతుల వారీగా కొనుగోళ్లు, సాగు విస్తీర్ణం, ధాన్యం వివరాలను నిర్వాహకులు ప్రతీ రోజూ ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనంతరం కేంద్రాల వారీగా ఇప్పటివరకు కొనుగోళ్లు, ట్యాబ్ ఎంట్రీ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో డీఆర్వో భుజంగరావు, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎస్‌వో శ్రీకళ, డీసీవో నర్సయ్య, మార్కెటింగ్ ఏడీ అశ్వాక్, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్

క్లుప్తంగా

బండి సంజయ్‌ను కలిసిన నగేశ్



గోడం నగేశ్‌ను సన్మానిస్తున్న బండి సంజయ్

ఆదిలాబాద్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను ఆదిలాబాద్ ఎంపీగా గెలిచిన గోడం నగేశ్ శుక్రవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్ ఎంపీగా భారీ మెజార్టీతో రెండోసారి గెలిచినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ గోడం నగేశ్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నగేశ్ వెంట ఎమ్మెల్యే పాయల్ శంకర్, నాయకుడు అశోక్ ఉన్నారు.

ఆదిలాబాద్: మహారాష్ట్ర సీఎం ఏకనాథ్ షిండేను ఎంపీ గోడం నగేశ్ ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. వీరి వెంట నాయకుడు అశోక్ ఉన్నారు.


108 సిబ్బందికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న పూజారి.లక్ష్మణ్

కుభీర్: భైంసా ఏరియాలో 108 అంబులెన్స్‌లో పనిచేసే ఈఎంటీ పూజారి లక్ష్మణ్, పైలట్ ఖాజామోహినొద్దీన్‌కు జాతీయ అవార్డు లభించింది. ఈ ఏడాది 20న గుండెపోటుతో కుప్పకూలిన విఠల్ వ్యక్తికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. దీంతో ఏప్రిల్ 22న రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. తాజాగా జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని తాజ్ హోటల్‌లో జీవీకే గ్రూప్స్ ప్రతినిధి జీవీకే.రెడ్డి గురువారం అవార్డు, నగదు అందజేశారు. కార్యక్రమంలో జీవీకే గ్రూప్స్ డైరెక్టర్లు కృష్ణమరాజు, వెంకటేశం పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మేకపోతు మృతి



మేక పోతు కళేబరం

తలమడుగు: మండలంలోని ఝరి గ్రామానికి చెందిన నారాయణ మేకపోతు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. నారాయణ తన మేకలను అడవిలోకి శుక్రవారం మేతకు తీసుకువెళ్లి తిరిగి వస్తున్నాడు. ఇందులోని రూ.15 వేల విలువైన ఒక మేకపోతు జియో టవర్‌కు విద్యుత్ సరఫరా చేసే స్తంభానికి తగలగా విద్యుత్ షాక్‌తో చనిపోయింది. టవర్ వారి నిర్లక్ష్యంతోనే తన మేకపోతు మృతి చెందినట్లు బాధితుడు ఆరోపించాడు. తనకు పరిహారం అందించాలని కోరుతున్నాడు.

జూన్.. బతుకు భారమే..

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన రేని మల్లయ్య అనే రైతు వ్యవసాయంపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనకున్న రెండెకరాలకు తోడు మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ప్రస్తుతం పత్తి, పసుపు పంటలు వేసేందుకు దుక్కి దున్ని చదునుచేసి ఉంచాడు. విత్తనాలు, భూమి చదును, ఎరువులు వంటి వాటికోసం ఖర్చులు పెద్ద మొత్తంలో అవుతున్నాయని వాపోతున్నాడు.

చాట్ల రమేశ్ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలోనే అద్దెకు ఉంటున్నాడు. తన ఇద్దరు పిల్లలను స్థానిక ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నాడు. నెలవారీ ఖర్చులు ఎలాగూ ఉండగా ప్రస్తుతం జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభం కానున్న తరుణంలో అడ్మిషన్ ఫీజులు, పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్ వంటి వాటి కోసం మరింత అదనపు ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నాడు.

- వ్యవసాయ పెట్టుబడులకు వ్యయం
- ఇక బడుల్లోనూ ప్రవేశాల ఖర్చు తడిసి మోపెడు
- మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం



దుక్కి దున్నుతున్న ట్రాక్టర్ (ఫైల్)

ఖర్చుల భారం ఇలా...
ప్రైవేటు చదువులకు ఖర్చులు:
పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిల్లో: అడ్మిషన్ ఫీజు రూ.5 నుంచి రూ.7వేలు
స్కూలు, ట్యూషన్ ఫీజు రూ.15 నుంచి రూ.30వేలు
పుస్తకాలకు రూ.4వేల నుంచి రూ.8వేలు
రెండు జతల యూనిఫాం రూ.3వేల నుంచి రూ.5వేలు
బస్సు రవాణా కోసం రూ.16 నుండి రూ.20 వేలు
హాస్టల్ వసతికి రూ.40 వేల నుంచి రూ.70వేలు

వ్యవసాయ పెట్టుబడులకు ఎకరాకు ఇలా..	
పత్తి విత్తనాలు	రూ. 2వేలు..
దుక్కి, సన్నద్ధత కోసం	రూ.6 నుండి 8వేలు
కూలీల ఖర్చు	రూ. 3వేలు
ఎరువులు	రూ.6వేలు
పురుగు మందులు	రూ.16వేలు
పత్తి తీయడానికి	రూ.4వేలు
మొత్తం	రూ.40 వేలు
వరి	రూ.60 వేలు
మొక్కజొన్న	రూ.35 వేలు

ఖర్చు పెరుగుతోంది..



పిల్లల చదువు కోసం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉంటున్నా. ఒకవైపు ప్రైవేటు ఉద్యోగం చేస్తూ నే మా ఇద్దరు పిల్లల్ని చదివిస్తున్నా. చదువుల కోసం తప్పనిసరి పరిస్థితుల్లో రూ.లక్ష వరకు వెచ్చించాల్సి వస్తోంది. దీనికి తోడు రోజువారీ ఖర్చులు నిత్యావసరాలు, ఇంటిఅద్దె పోనూ రూపాయి కూడా మిగలడం లేదు. మళ్లీ కొత్త అప్పులు చేయాల్సి వస్తోంది. – **తక్కలపల్లి సునీల్ కుమార్, ప్రైవేటు ఉద్యోగి, నిర్మల్**

రెండువైపులా భారం..



జూన్ వచ్చిందంటే చాలు రెండువైపులా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఒకవైపు పిల్లల చదువులపై, మరోవైపు పంట పెట్టుబడులు. ఇలా రెండు వైపులా ఒకేసారి ఒకే నెలలో ఖర్చు పెట్టాల్సి రావడంతో భారం పడుతోంది. ఏటా వేసవి సెలవులు పూర్తవుతున్నాయంటేనే తీవ్ర మానసిక ఒత్తిడి కలుగుతోంది. – **దాసరి గణేశ్, రైతు, కౌట్ల(బి), సారంగపూర్**

నిర్మల్‌ఖిల్లా: ఇలా జూన్ నెల అంటేనే సామాన్యులు భయపడే పరిస్థితి తలెత్తుతోంది. జూన్ మొదటి వారం నుంచి వ్యవసాయానికి పెట్టుబడి కాలం. పిల్లల చదువుల కోసం అన్నిరకాల ఖర్చులు కలిపి తడిసి మోపెడవుతున్నాయి. ఈ నేపథ్యంలో సామాన్య ప్రజలు జూన్ వచ్చిందంటేనే దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. మృగశిర కార్తె నుంచి ఖర్చులు కూడా మొదలవుతున్నాయి. వాతావరణం చల్లబడుతున్న తరుణంలో సామాన్యులకు మాత్రం జూన్ మాసం ముచ్చెమటలు పట్టిస్తోంది. దిగువ మధ్యతరగతి వ్యవసాయ ఆధార కుటుంబాల ప్రజానీకం ఖర్చులకు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

అన్నదాత పరిస్థితి అగమ్య గోచరమే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 6 లక్షలకు పైగా రైతులు ఉన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలకు పెట్టుబడి కాలం.. వ్యవసాయ పంట భూములను చదును చేసి, దుక్కిదున్ని, విత్తనాలు, ఎరువులకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే వ్యవసాయదారులు దుక్కులు, విత్తనాల కొనుగోలు వంటి పనులు ప్రారంభించారు. కనీసం ఎకరానికి రూ.30 వేల పెట్టుబడికి అవసరం కానుంది. ఐదెకరాలున్న రైతు దాదాపు రూ.లక్షకు పైగా డబ్బు వెచ్చించాల్సి ఉంటుంది. ప్రభుత్వం రైతు భరోసా కింద పెట్టుబడి సాయం వస్తున్నా అది సరైన సమయానికి చేతికందడం లేదు. పైగా బ్యాంకుల రుణాలు కూడా అవసరమైన సమయానికి అందడం లేదు. దీంతో రైతులు ఒకవైపు బ్యాంకుల చుట్టూ తిరుగుతూనే మరోవైపు ప్రైవేటు వడ్డీవ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అటు పిల్లల చదువులు ఇటు వ్యవసాయ పెట్టుబడికి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

పిల్లల బడి ఫీజులు భారం..

ఉమ్మడి జిల్లాలో దాదాపు 800కు పైగా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. గ్రామీణ, మండల స్థాయిలో కొంతమేర తక్కువ ఫీజులు వసూలు చేస్తుండగా.. పట్టణ ప్రాంతాల్లో ఫీజులు ఎక్కువ మొత్తంలో ఉన్నాయి. ప్రీ ప్రైమరీ తరగతులకు రూ.30 వేలకు పైగా, ప్రైమరీకి రూ.40వేలు, హైస్కూల్‌కు రూ.50 వేల వరకు ఫీజులు ఉన్నాయి. ఏటా 10 నుంచి 20 శాతం మేర ఫీజులు పెరుగుతుండడంతో తల్లిదండ్రులపై భారం పడుతోంది. దీనికి తోడు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాం, బ్యాగులు స్టడీ మెటీరియల్ ఇతర ఇతర ఖర్చులతో తల్లిదండ్రులపై భారం పెరుగుతోంది. ప్రైవేటు ఉద్యోగం చేసుకునే తల్లిదండ్రులు, చిన్నాచితకా, చిరు వ్యాపారాలు చేసుకునే వారిపై బడి ఫీజుల భారం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. జిల్లా కేంద్రానికి చెందిన ఒక ప్రైవేటు ఉద్యోగి తన కూతురు 9వ తరగతి చదువుతుండగా.. నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు యూనిఫాం, బడి ఫీజు, అడ్మిషన్ ఫీజు వంటివన్నీ కలుపుకొని లక్ష వరకు అవుతుందని చెప్తున్నారు. కాగా ఇంత మొత్తం ఖర్చును భరించలేక ప్రభుత్వ విద్యాసంస్థలో తన కూతుర్ని జాయిన్ చేశాడు. ఇలా ఫీజుల భారం మధ్యతరగతి కుటుంబాలపై ఎక్కువగా పడుతోంది.

పిడుగుపాటు మృతుల అంత్యక్రియలు



మృతదేహాల వద్ద కుటుంబీకులు, గ్రామస్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని డొంగర్‌గామ్ గ్రామానికి చెందిన అనక సంతోష్, స్వప్న దంపతులు గురువారం సాయంత్రం పిడుగుపడి మృతి చెందగా గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం పోలీసులు పంచనామా అనంతరం కుటుంబీకులకు మృతదేహాలు అప్పగించగా ఇద్దరికీ ఒకేచోట అంత్యక్రియలు నిర్వహించారు. దంపతుల మృతితో ఏడాది వయస్సున్న వీరి కుమార్తెను చూసి గ్రామస్తులు కంటతడి పెట్టారు. వివిధ పార్టీల నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



శ్రీకాంత్ మృతదేహం..

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధి ఇప్పమాడ గ్రామంలో శుక్రవారం విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతిచెందాడు. ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పమాడ గ్రామానికి చెందిన తొడసం శ్రీకాంత్(22) ఇంటి ఆవరణలోని బావికి బిగించిన మోటార్ పనిచేయకపోవడంతో బయటకు తీశాడు. మరమ్మతుకు తీసుకెళ్లేందుకు విద్యుత్ కనెక్షన్ తొలగిస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాంత్ తండ్రి ఇస్రు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ఓడినా ప్రజాసేవ చేస్తూనే ఉంటా'



మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

నేరడిగొండ: ఓటమితో కుంగిపోకుండా ప్రజాసేవకు అంకితమవుతానని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో తనను రెండో స్థానంలో నిలిపిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తాను పోటీ పడింది బీజేపీ అభ్యర్థితో కాదని, ప్రధాని మోదీతోనేనని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. చివరిశ్వాస వరకు కాంగ్రెస్‌లో ఉండి ప్రజాసేవకు అంకితమవుతానని చెప్పారు. బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మాట్లాడుతూ.. ఇలాగే సమష్టిగా స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. నాయకులు గొర్ల రాజుయాదవ్, పసుల చంటి, బోథ్ ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, తలమడుగు ఎంపీపీ కళ్యాణం రాజేశ్వర్, నాయకులు ఆడె వసంత్, ప్రఫుల్‌చందర్‌రెడ్డి, రాజారెడ్డి, గడ్డం నారాయణ, అనుపట్ల సంజీవ్‌కుమార్, వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇదేనా సమయ పాలన!?

పాలనా సౌలభ్యం కోసం అన్ని శాఖల సేవలు ఒకేచోట ప్రజలకు అందాలన్న సంకల్పంతో గత ప్రభుత్వం కొత్త జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్ కార్యాలయాలు నిర్మించింది. నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్మించిన కలెక్టర్ కార్యాలయాన్ని గతేడాది జూలై 4న ప్రారంభించారు. ఇక్కడ సేవలు అందుబాటులోకి వచ్చి ఏడాది కావొస్తున్నా.. ఇప్పటికీ కొందరు అధికారులు తమ కార్యాలయాలను కలెక్టర్ కార్యాలయంలోకి మార్చకుండా పాత ఆఫీసులలోనే కొనసాగిస్తున్నారు. మరికొందరు అధికారులు సమయపాలన పాటించకుండా ఉదయం 11 గంటలకు కార్యాలయాలకు వస్తున్నారు. స్వయంగా కలెక్టర్ ఉండే కార్యాలయంలోనే అధికారుల సమయపాలన పాటించకుండా ఇష్టానుసారం విధులకు రావడంతో శుక్రవారం ఉదయం 11 గంటలకు కూడా ఇలా ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్



ఉదయం 10:55 గంటలకు హార్టికల్చర్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు..



కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు కూడా తెరుచుకోని కార్యాలయాలు..

పిడుగుపాటుకు బాలుడు మృతి



జాదవ్ కృష్ణ మృతదేహం

సారంగపూర్: మండలంలోని దుర్గానగర్ తండాకు చెందిన జాదవ్‌పండిత్–జాదవ్ సునీత బాయిల కుమారుడు జాదవ్ కృష్ణ(14) శుక్రవారం పిడుగు పడి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పండిత్ తన కుటుంబ సభ్యులతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. ఈక్రమంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో చిరు జల్లులు కురిశాయి. అవెంటనే పిడుగు పడడంతో కృష్ణ అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కృష్ణ మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకు పిడుగుపాటుకు బలికావడంతో ఆదంపతుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

భైంసాటౌన్: పట్టణంలోని పాత చెక్‌పోస్ట్ సమీపంలో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సంతోష్(25) ధర్మాబాద్ నుంచి ఆటోలో భైంసాకు వస్తుండగా, పాత చెక్‌పోస్ట్ సమీపంలోకి రాగానే అదుపు తప్పి గుంతలో పడింది. ఈ ఘటనలో సంతోష్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఏరియాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఎండీ.గౌసుద్దీన్ తెలిపారు.

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

రెబ్బెన(ఆసిఫాబాద్): మహిళను పెళ్లి పేరుతో మోసగించిన నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6వేల జరిమానా విధిస్తూ శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చినట్లు రెబ్బెన సీఐ చిట్టిబాబు తెలిపారు. రెబ్బెన గ్రామానికి చెందిన లకావత్ రవి అదే గ్రామానికి చెందిన మహిళను ఎనిమిదేళ్లుగా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరకంగా లొంగదీసుకున్నాడు. మహిళ కుటుంబ సభ్యులు పెళ్లి చేసుకోవాలని కోరగా నిరాకరించాడు. దీంతో బాధిత మహిళ 2020, ఫిబ్రవరి 26న రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారులు రమేశ్, అశోక్, సతీష్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పీపీ జగన్మోహన్‌రావు సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో నిందితుడికి పైవిధంగా శిక్ష ఖరారు చేస్తూ జిల్లా జడ్జి తీర్పునిచ్చారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన డీఎస్పీ సదయ్య, సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్, కోర్టు ఆసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ అధికారి రాంసింగ్‌తో పాటు కోర్టు సిబ్బందిని ఎస్పీ సురేష్‌కుమార్ అభినందించారు.

పిడుగుపాటుకు సబ్‌స్టేషన్‌లో సాంకేతిక లోపం

బోథ్: మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రం చుట్టుపక్కల శుక్రవారం సాయంత్రం పిడుగు పడటంతో ఉపకేంద్రంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఉపకేంద్రం పరిధిలో దాదాపు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు జిల్లా కేంద్రంలోని టెక్నికల్ బృందానికి సమాచారం అందించారు. ఆదిలాబాద్ నుంచి వచ్చిన టెక్నికల్ బృందం శ్రమించి సాంకేతిక సమస్యను గుర్తించి సరిచేశారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

అగ్ని ప్రమాదం

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధి సత్యసాయినగర్ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. కాలనీ వాసులు నీరు తెచ్చి చల్లార్చడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విద్యుత్ వైర్లు మండడంతో రాలిన నిప్పు రవ్వలు కింద ఉన్న చెత్తకుప్పలపై పడి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. స్థానికులు బకెట్లతో నీరు పోసినా చల్లారలేదు. మున్సిపాలిటీ వాటర్ ట్యాంక్ ద్వారా మంటలు ఆర్పడంతో ఎలాంటి ఆస్తి నష్టం జరుగలేదు.

ఆంధ్రాకు అడవి పందులు!

- అక్రమంగా తరలించుకుపోతున్న వేటగాళ్లు
- వారం వ్యవధిలోనే రెండు వాహనాలు పట్టివేత



అక్రమ రవాణా చేస్తున్న అడవి పందులను పట్టుకున్న అటవీశాఖ అధికారులు

నిర్మల్ టౌన్: వేసవికాలం వచ్చిందంటే చాలు అడవిలో వన్యప్రాణికి రక్షణ కరువవుతోంది. నీళ్ల కోసం వచ్చే వన్యప్రాణులను సంహరిస్తున్నారు వేటగాళ్లు. నీటి వసతి ఉన్న ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చి, ఉచ్చులు ఏర్పాటు చేసి పట్టుకుంటున్నారు. వాటిని సంహరించి మాంసం అక్రమంగా విక్రయిస్తున్నారు. తాజాగా ఆంధ్రా వేటగాళ్లు కూడా జిల్లాకు వచ్చి అడవి పందులను తరలించుకుపోతున్నారు.


అడవి పందుల అక్రమ రవాణా....

జిల్లాలో అడవి పందుల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన వేటగాళ్లు జిల్లాలోని అడవి పందులను పట్టుకుని అక్రమంగా తరలించుకుపోతున్నారు. వారం వ్యవధిలోనే అడవి పందులను తరలిస్తున్న రెండు వాహనాలను అటవీ అధికారులు పట్టుకున్నారు. అడవి పందుల మాంసానికి ఆంధ్రాలో డిమాండ్ ఉండడంతో అక్కడి వేటగాళ్లు ఇక్కడి వేటగాళ్లతో మాట్లాడుకుని పందులను పట్టుకుంటున్నారు. తర్వాత వాహనాల్లో తరలించుకుపోతున్నారు. పట్టుకున్న అడవి పందులను పశ్చిమగోదావరి జిల్లాకు తరలిస్తున్నట్లు పట్టుబడిన వారు చెప్పారని అధికారులు వెల్లడించారు. వీటిని స్థానిక వేటగాళ్లే వేటాడినట్లు విచారణలో గుర్తించారు.

కొబ్బరి బోండాల వాహనాల్లో..

ఓ ఏజెంటు సహాయంతో వేటగాళ్లు పందులను పట్టుకుని ఒకచోట బంధిస్తున్నారు. పది వరకు పోగయిన తర్వాత ఆంధ్రా ప్రాంతానికి చెందిన వేటగాళ్లకు సమాచారం ఇస్తున్నారు. ఆంధ్రా నుంచి జిల్లాకు కొబ్బరి బోండాలు తీసుకువచ్చే వాహనదారులతో మాట్లాడుకుని రాత్రి వేళ పందులను వాహనాల్లో తరలించుకుపోతున్నారు. ఈ క్రమంలో మే 27 అర్ధరాత్రి సమయంలో అడవి పందులను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమై సోన్ మండల కేంద్రంలోని చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఓ వాహనం అనుమానాస్పదంగా కనిపించింది. దానిని తనిఖీ చేయగా వాహనంలో 10 అడవి పందులు కనిపించాయి. వాహనంలో ఉన్న ఇద్దరినీ విచారణ చేయగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారమని తెలిపారు. వీరిని అరెస్టు చేశారు. ప్రాణాలతో ఉన్న నాలుగు అడవి పందులను మేజిస్ట్రేట్ అనుమతితో అడవిలో వదిలేశారు. జూన్ 1వ తేదీన అర్ధరాత్రి సమయంలో అడవి పందులను తరలిస్తున్నారని సమాచారం రావడంతో అటవీ అధికారులు సోన్ చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొబ్బరి బోండాల వాహనంలో 13 అడవి పందులు పట్టుబడ్డాయి. అక్రమంగా పందులు తరలిస్తున్న వారిని అరెస్టు చేశారు.

అక్రమ రవాణాను అడ్డుకుంటాం..



వన్యప్రాణుల అక్రమ రవాణాను అడ్డుకుంటాం. అక్రమంగా తరలించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు ముమ్మరం చేశాం. క్యాచ్ ద ట్రాప్ అనే పేరుతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించి తనిఖీలు చేపడుతున్నాం. – **కేపీఎస్.ప్రసాద్‌రెడ్డి, డీఎఫ్‌వో**

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

నార్నూర్: నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య అన్నారు. శుక్రవారం నార్నూర్, గాదిగూడ మండలాల్లోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫర్టిలైజర్ దుకాణాల్లోని రికార్డులు పరిశీలించారు. రైతులకు విక్రయిస్తున్న బీటీ పత్తి విత్తనాలపై ఆరా తీశారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే విత్తనా లు కొనుగోలు చేయాలని, రశీదు తీసుకుని భద్రపరచాలని సూచించారు. ఎవరైనా అధిక ధరకు విక్రయించినా.. బ్లాక్ చేసినా తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏవో జాడి విద్య, ఏఈవో కళ్యాణి తదితరులున్నారు.



లోకారి-కేలో దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు